క్లుప్తంగా

'ఉపాధి'లో నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

ఇల్లెందురూరల్: ఉపాధి హామీ పథకం పని ప్రదేశంలో నిబంధనలు పాటించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ డిమాండ్ చేశారు. మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీలో ఉపాధి పథకం పని ప్రదేశాన్ని శుక్రవారం సందర్శించారు. మాట్లాడుతూ.. మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని పని ప్రదేశంలో నీరు, నీడ, ప్రథమచికిత్స సౌకర్యాలను కల్పించాలని కోరారు. పనుల వద్ద పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల పర్యవేక్షణ లేకపోవడం విచారకరమన్నారు. రోజువారీ కూలీని రూ.300లకు పెంచాలని డిమాండ్ చేశారు. లక్ష్మి, రాందాస్, శ్రీదేవి, కుమారి, చిన్ని, నిరోషా, భద్రమ్మ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

జూలూరుపాడు: ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎస్కే చాంద్‌పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యావిధానం కోసం అధిక నిధులు కేటాయించి విద్యను పటిష్టం చేయాలన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించడం ద్వారా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు విద్య అందించవచ్చన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద చేపట్టిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

విరాళం

పాల్వంచరూరల్: కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి ఖమ్మానికి చెందిన కె.శ్రీధర్‌రెడ్డి గీతాకృష్ణవాణి దంపతులు రూ.10,116 విరాళాన్ని అందచేసినట్లు ఆలయ ఈఓ జి.సుదర్శన్ శుక్రవారం తెలిపారు. విరాళాలు అందజేసిన భక్త దంపతులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు.

అన్నదానం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి బూడిదగడ్డలోని స్నేహలత–సంధ్యాలత, జ్యోతి వృద్ధాశ్రమం, సత్యసాయి ఆశ్రమంలో బీఎస్ఎన్ఎల్ శాఖ కార్యాలయం ఉద్యోగి శివరాంజి, ఆయన సతీమణి నాగమణి శుక్రవారం అన్నదానం చేశారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న దుర్గారావు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న నేపథ్యంలో మాజీ సింగరేణి కార్మికుడు చింతపల్లి దుర్గారావు, పట్టణంలోని వివిధ ప్రాంతాలలో ద్విచక్ర వాహనంపై తిరుగుతూ ప్రజలకు మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. ఏప్రిల్ నుంచి పట్టణానికి చెందిన దుర్గారావు రెండు రోజులకోసారి దాదాపు 40 లీటర్ల మజ్జిగను ఇంట్లో తయారు చేసి పట్టణంలో జనసంచారం ఎక్కువగా ఉన్నచోట ఉచితంగా పంపిణీ చేస్తున్నాడు. శుక్రవారం ప్రభుత్వాస్పత్రి, బస్టాండ్ ఏరియా, సింగరేణి ఆస్పత్రి ఏరియాలలో మజ్జిగ పలువురికి పంపిణీ చేశారు.

హరిత నర్సరీలు కళకళ

- నర్సరీల్లో మొక్కల సంరక్షణకు చర్యలు
- ఎండిపోకుండా గ్రీన్‌నెట్‌ల ఏర్పాటు
- మొక్కలకు ఎప్పటికప్పుడు నీటి తడులు
- ఒక్కో నర్సరీలో 10 వేల మొక్కల పెంపకం



నర్సరీలో నీడ కోసం గ్రీన్‌నెట్‌లను ఏర్పాటు చేసిన దృశ్యం

చుంచుపల్లి: జూలైలో చేపట్టనున్న హరితహారం కోసం నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం ప్రతీ గ్రామ పంచాయతీకి ఒక నర్సరీని ఏర్పాటు చేశారు. హరిత నర్సరీల పర్యవేక్షణ బాధ్యతలను ఆయా పంచాయతీలకే అప్పగించారు. ప్రతీ నర్సరీలో పదివేల మొక్కలను సిద్ధం చేయాలని అధికారులు ముందే నిర్దేశించి పెంచుతున్నారు. ఇందుకోసం గతేడాది నవంబర్ నుంచే హరిత నర్సరీల్లో మొక్కల పెంపకం పనులు చేపట్టారు. ప్రధాన రహదారుల పక్కన, చెరువు కట్టలపై, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో నాటడానికి అనువైన మొక్కలను సిద్ధం చేస్తున్నారు. అయితే ఇటీవల జిల్లాలో ఎండలు మండిపోతున్న నేపథ్యంలో మొక్కలను రక్షించేందుకు అధికారులు తగిన జాగ్రత్తలు చేపట్టారు. నర్సరీల్లో మొక్కలు అధిక ఉష్ణోగ్రతలకు వాడిపోకుండా, చనిపోకుండా రక్షణగా నీడ సౌకర్యం కలిపిస్తున్నారు. హరిత నర్సరీల్లో మొక్కలకు తగిన నీడ కోసం గ్రీన్ నెట్‌లను ఏర్పాటు చేశారు. చలువ పందిళ్లను ఏర్పాటు చేసి తరుచూ నీటి తడులు పెడుతున్నారు. ఉపాధి కూలీలు ఎప్పటికప్పుడు మొక్కల పెరుగుదలను పర్యవేక్షిస్తున్నారు. చుంచుపల్లి మండలంలో 18 గ్రామ పంచాయతీల్లో హరిత నర్సరీల్లో ఈ మొక్కల పెంపకాన్ని చేపట్టారు. ఒక్కో నర్సరీలో పదివేల చొప్పున సుమారు 2 లక్షల మొక్కలను హరితహారం పథకానికి అందించనున్నారు. వర్షాకాలం ఆరంభం కాగానే జూలైలో నిర్వహించనున్న హరితహారంలో వీటిని నాటేందుకు అనువుగా పెంచుతున్నారు.

తీవ్ర ఎండల నుంచి రక్షణకు చర్యలు...

హరిత నర్సరీల్లో నాటిన ప్రతీ విత్తు మొలకెత్తడానికి, తరువాత మొలిచిన మొక్కను ఎండల నుంచి రక్షించడానికి ఉపాధి కూలీలు ఎప్పటికప్పుడు నీటి తడులు పెడుతూ తగిన సంరక్షణ చర్యలు తీసుకుంటున్నారు.

- గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో టేకు, వెదురు, దానిమ్మ, ఆకాశ మల్లి, నిమ్మ, జామ, సీతాఫలం, బొప్పాయి, కర్జూరం, నిద్ర గన్నేరు, మల్బార్ వేప, గానుగ, వేప, కదంబ, గుల్‌మొహర్, మారేడు, స్పాంథోడియా, కరివేపాకు, గోరింట, ఉసిరి, చింత, రేగు, ఈత, నేరేడు వంటి 20 రకాలకు పైగా మొక్కలు పెంచుతున్నారు. ఇప్పటికే పెరిగిన కొన్ని రకాల మొక్కల కొమ్మలను కత్తిరించి నాటుతున్నారు.
- మొక్కలు బలంగా ఉండేందుకు నర్సరీల్లో కూలీలు తరచూ కలుపు తీస్తున్నారు. ఏపుగా పెరిగిన మొక్కలను పెద్ద కవర్లలోకి మారుస్తున్నారు. అక్కడక్కడా చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ కొత్తగా కొత్త కొమ్మలను నాటుతున్నారు. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో ఎండలు తీవ్రమయ్యాయి. దీంతో నర్సరీల్లో చిన్నగా ఉన్న మొక్కలు వాడిపోకుండా నీడ కోసం ఉపాధి అధికారులు, పంచాయతీ సిబ్బంది గ్రీన్ నెట్ వలలు ఏర్పాటు చేశారు.



మొక్కలకు నీళ్లు పడుతున్న కూలీ

- నర్సరీల్లోని మొక్కలకు తరచూ నీటి తడులు అందిస్తున్నారు. దీంతో మండే వేసవిలో మొక్కలు వాడిపోకుండా ఉంటాయని అధికారులు అంటున్నారు. మొక్కల పెంచే సంచులకు చదలు పట్టకుండా గెమాగ్జిన్ పౌడర్ వంటివి చల్లిస్తూ నిత్యం హరిత నర్సరీలను పర్యవేక్షణ చేస్తున్నారు.

నర్సరీలను పర్యవేక్షిస్తున్నాం..



వచ్చే హరితహారం కోసం గతేడాది నవంబర్ నుంచి హరిత నర్సరీలలో మొక్కలు పెంచే పనులను ప్రారంభించాం. గ్రామ పంచాయతీల పర్యవేక్షణలో నర్సరీల్లో మొక్కలు ఉత్పత్తి చేస్తాం. ప్రతీ నర్సరీలో పదివేల మొక్కలు పెంచుతున్నాం. పూల మొక్కలతో పాటు నీడ నిచ్చే మొక్కలు కూడా ఉన్నాయి. ప్రతీరోజూ హరిత నర్సరీల్లో పనులను పర్యవేక్షిస్తున్నాం.

– నాగరాజు, ఉపాధి సిబ్బంది

ఎప్పటికప్పుడు నీటి తడులు..



మండలంలోని 18 గ్రామాల్లో ఏర్పాటు చేసిన హరిత నర్సరీల్లో సుమారు 2 లక్షల మొక్కలు సజావుగా ఉత్పత్తి కావడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. తీవ్ర ఎండల నేపథ్యంలో నర్సరీల్లో మొక్కలు వాడిపోకుండా చలువ పందిళ్లను ఏర్పాటు చేశాం. పిచ్చిమొక్కలను తొలగిస్తూ కలుపు తీయిస్తున్నాం. వేసవి ఎండల దృష్ట్యా ఎప్పటికప్పుడు నీటి తడులు అందిస్తున్నాం.

– గుంటి సత్యనారాయణ, ఎంపీఓ

వేడుకలు విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సింగరేణి అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): జూన్ 2న కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర పదో ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ సెక్యూరిటీ) జీఎం బీఆర్ దీక్షితులు కోరారు. శుక్రవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... సింగరేణి వ్యాప్తంగా వేడుకలు నిర్వహించేందుకు సంస్థరూ.37 లక్షలు కేటాయించిందన్నారు. సాయంత్రం 6 గంటలకు ర్యాలీ, కల్చరల్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. సీతా ప్రసాద్ బృందంతో క్లాసికల్ డ్యాన్స్ కార్యక్రమాలు నిర్వహించనున్న నేపథ్యంలో సింగరేణి ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులు అదిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏజీఎం (పర్సనల్) కే.శ్రీనివాస్, డీవైపీఎం బి.సుశీల్, సీనియర్ పీఓలు టి.శ్రీనివాస్‌రావు, జీకే కిరణ్ కుమార్, వెల్ఫేర్ పీఓ వరప్రసాద్‌రావు, స్పోర్ట్స్ సూపర్ వైజర్ ఎంసీ పాసినెట్, సేవా కోఆర్డినేటర్లు షరీఫ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వేడుకల ఏర్పాట్లు పరిశీలన

ఇల్లెందు: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం కోసం ఇల్లెందు జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో చేపట్టిన ఏర్పాట్లను ఏరియా జీఎం జాన్ ఆనంద్ సందర్శించి పరిశీలించారు. శుక్రవారం సింగరేణి అధికారులతో కలిసి ఆయన గ్రౌండ్ పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రకాల స్టాల్స్, తెలంగాణ రుచులతో కూడిన స్టాల్స్, సింగరేణి పుట్టినిల్లు చరిత్ర ఫొటో ప్రదర్శన స్టాల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాటికి తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు. పార్కింగ్, తాగునీరు, షామియానాల ఏర్పాటు, అంబులెన్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జీఎం వెంట జీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, డీజీఎం సివిల్ రవికుమార్, పర్సనల్ అధికారి సాయి స్వరూప్ తదితరులు ఉన్నారు.

విత్తనాల కొనుగోళ్లలో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఏడీఏ వాసవీరాణి

టేకులపల్లి: వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ ఇల్లెందు డివిజన్ అధికారి (ఏడీఏ) పి.వాసవీరాణి అన్నారు. ఈ మేరకు శుక్రవారం టేకులపల్లి మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బోడు గ్రామంలో రైతులకు నకిలీ విత్తనాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. వ్యవసాయ సీజన్‌లో హడావుడిగా ఎక్కడ పడితే అక్కడ విత్తనాలు కొనుగోలు చేయొద్దన్నారు. వ్యవసాయ శాఖ చేత గుర్తించబడి లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. ప్యాకింగ్‌పై కంపెనీ పేరు, తయారీ తేదీ, ముగింపు తేదీ వివరాలు తప్పనిసరిగా సరి చూసుకోవాలని చెప్పారు. రశీదు తప్పక తీసుకోవాలని పంటకాలం పూర్తయ్యే వరకు ఇంట్లో భద్రపర్చుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా, అనుమతులు లేకుండా విత్తనాలు విక్రయిస్తే వ్యవసాయ, పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. టేకులపల్లిలోని బేతంపూడి సొసైటీలో జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. పచ్చిరొట్ట పైర్లు వేసుకుని భూమిని బలంగా చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి నీరుడ అన్నపూర్ణ, ఏఈఓ రమేష్, రైతులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతాంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం ప్రదర్శన నిర్వహించి, కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ఎదళ్లపల్లి సత్యం అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర కార్యదర్శి గౌని అయిలయ్య మాట్లాడుతూ... రూ.2లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని కోరారు. నకిలీ విత్తనాలు, పురుగు మందుల కంపెనీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ప్రభుత్వ బ్యాంకుల ద్వారా వ్యవసాయ రుణాలు ఇవ్వాలన్నారు. దొడ్డు వడ్లకు కూడా బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు మొక్కజొన్న, వరి తదితర పంటలు తడిసిపోయాయని, ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలను 75 శాతం సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు. అన్ని పంటలకు ముందుగానే మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. జి.అనురాధ, జె.సీతారామయ్య, మెస్సు గోపాల్, హరీజ, నర్సింగ్, వీరమళ్ల రాములు, ఎల్.విశ్వనాథం, ఎండీ రాసుద్దీన్, బయ్య శారద, ఆదిలక్ష్మి, కల్తి రాములమ్మ, మోకాళ్ల రమేష్, మోకాళ్ల సుగుణ, భానుచందర్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

ఇల్లెందురూరల్: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మరమ్మతు పనులు వేగవంతం చేసి జూన్ 5 నాటికి పూర్తయ్యేలా కృషి చేయాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో 54 అమ్మ ఆదర్శ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పనుల తీరుపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నిర్మాణ పనులు నాణ్యతతో, సకాలంలో పూర్తయ్యేలా కాంట్రాక్టర్లను ప్రోత్సహించాలని చెప్పారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నందున ఆ రోజుకు ముందే పనులు పూర్తయితే ఉపయోగించుకునేందుకు వీలుగా ఉంటుందని చెప్పారు. వీటితోపాటు విద్యార్థులకు యూనిఫాం కూడా పంపిణీ చేయాలన్నారు. హెచ్ఎంలు, పొదుపు సంఘాల మహిళలు, అధికారులు పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు. సమావేశంలో ఎంఈఓ పిల్లి శ్రీనివాస్, సెర్ప్ ఏపీఎం దుర్గారావు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

తూముకు మరమ్మతులు చేపట్టండి

టేకులపల్లి: మండలంలో సుమారు రెండు వేల ఎకరాల పంట పొలాలకు నీటి సరఫరా చేస్తున్న రోళ్లపాడు చెరువు తూములకు మరియు కుడి, ఎడమ కాలువలకు టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభించాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ, అఖిలభారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) సంఘాల ఆధ్వర్యంలో తూముల మరమ్మతులు చేపట్టాలని గతంలో ఆందోళనలు చేసిన నేపథ్యంలో రూ.7.5 లక్షలు మంజూరయ్యాయని, కానీ టెండర్లు నిర్వహించి పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. వర్షాకాలం ప్రారంభం కావస్తోందని వానలకు చెరువు నిండితే వృథా అయ్యే పరిస్థితి ఉందన్నారు. అధికారులు వెంటనే టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభించాలని కోరారు.

కానిస్టేబుల్‌కు ఎస్పీ అభినందన



రత్నకుమారిని అభినందిస్తున్న రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: పాప్ ఇండియా ఓపెన్ మీట్‌లో 100, 400 మీటర్ల హార్డిల్స్ జంప్ విభాగంలో బంగారు పతకం సాధించిన క్రీడాకారిణి కానిస్టేబుల్ రత్నకుమారిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు. కొత్తగూడెం త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రత్నకుమారి శుక్రవారం ఎస్పీ రోహిత్‌రాజును మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, త్రీటౌన్ సీఐ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారుల ఆందోళన



గోడ తొలగించిన దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో ఇటీవల ప్రారంభమైన మున్సిపల్ మార్కెట్‌కు గేట్ల ఏర్పాటుపై అక్కడి వ్యాపారులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఆందోళన చేశారు. రూ.1 కోటితో మున్సిపల్ మార్కెట్ నిర్మాణం చేపట్టి ఇటీవల ప్రారంభించడంతో అందులో చిరు వ్యాపారులు వ్యాపారం చేసుకుంటున్నారు. అయితే మార్కెట్‌కు ముందు స్థలంలో వాహనాలు నిలిపే అవకాశం లేకుండా కొంతమంది తాత్కాలిక షెడ్‌లు ఏర్పాటు చేసుకొని వాటిల్లో పండ్లు, కూరగాయల వ్యాపారం చేస్తున్నారు. దీంతో అక్కడ వాహనాలు నిలిపి అవకాశం లేకపోవడంతో వినియోగదారులు ఎవరూ లోపలికి వచ్చి కొనుగోలు చేయడం లేదని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. షెడ్లను తొలగించాలని వ్యాపారులు ఆందోళన చేశారు. చివరికి మున్సిపల్ అధికారులు వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

విత్తనాల పంపిణీ



విత్తనాలు అందజేస్తున్న ఏఓ నర్మద

సుజాతనగర్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సొసైటీ గోడౌన్ వద్ద శుక్రవారం సబ్సిడీపై రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిణి జి.నర్మద మాట్లాడుతూ..

జీలుగు, జనుము విత్తనాలను పొలాల్లో వేయడం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. విత్తనాల ద్వారా నేలలో సూక్ష్మజీవుల అభివృద్ధి జరిగి నేల గుల్లబారి పంటకు బలమైన వేరు వ్యవస్థ ఏర్పడి అధిక దిగుబడులు వస్తాయన్నారు. జీలుగు 30 కిలోల బస్తా రూ.1,116, జనుము 40 కిలోల బస్తా రూ.1,448 అని తెలిపారు.

ఖర్చు ఘనం.. బిల్లులు అసంపూర్ణం

- ఏడాది గడిచినా రాని నాటి పెట్టుబడి
- దశాబ్ది ఉత్సవాలంటేనే బెంబేలెత్తుతున్న అధికారులు
- నేడు ఖాళీ ఖజానాతో భారంగా మారిన వేడుకలు



సుదిమళ్ల గ్రామ పంచాయతీ కార్యాలయం

ఇల్లెందురూరల్: మండలంలోని ఓ మారుమూల గ్రామపంచాయతీలో గత ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణ కోసం సదరు గ్రామపంచాయతీకి నాటి ఉన్నతాధికారులు రూ.1.02 లక్షలు కేటాయించారు. కానీ ఉత్సవాల నిర్వహణకు సదరు పంచాయతీకి మొత్తంగా రూ.1.72 లక్షలు ఖర్చు అయ్యాయి. అదనపు పెట్టుబడిని పంచాయతీ నుంచి తీసుకోవాలని చెప్పిన అధికారులు, ఆ సొమ్ము కూడా ఇస్తామని ప్రకటించి నేటికీ ఉట్టి చేతులే మిగిల్చారు. ఫలితంగా పెట్టుబడి పెట్టిన ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు ఏడాదిగా అప్పుల భారాన్ని మోస్తూనే ఉన్నారు. ఇది ఒక్క గ్రామపంచాయతీ ఎదుర్కొంటున్న సమస్య కాదు. మండలంలోని 29 గ్రామపంచాయతీలలోనూ నెలకొంది.

వైభవంగా దశాబ్ది ఉత్సవాలు...

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించాలని నాటి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వారోత్సవాల మాదిరిగా నిర్వహించాలని సూచించింది. రోజువారీ కార్యక్రమాలను నిర్దేశించింది. దీనికి అనుగుణంగా గ్రామ పంచాయతీలలో ప్రత్యేక కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. వ్యవసాయ, విద్యుత్, ఇరిగేషన్, గ్రామపంచాయతీ తదితర శాఖల వారీగా దశాబ్దకాలంగా చేపట్టిన పనులను వివరిస్తూ రోజువారీ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా చెరువుల పండుగ పేరుతో మండలంలోని 29 గ్రామపంచాయతీలోని ప్రజలను చెరువు వద్దకు పిలిపించి సామూహికంగా భోజనం వడ్డించారు. వేడుకల ప్రారంభం రోజున గ్రామపంచాయతీ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించి పండుగ వాతావరణం సృష్టించారు. జూన్ 2న జాతీయ జెండాను ఆవిష్కరించి మిఠాయి పంపిణీ చేశారు.

వేడుకల కోసం అప్పు చేసి..

రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ కోసం శాఖల వారీగా నిధులు కేటాయించారు. ముందస్తుగా నిధులు కేటాయింపు లేకపోవడంతో చాలా వరకు సంబంధిత శాఖల ప్రజాప్రతినిధులు, అధికారులు అప్పు చేసి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించిన ఖర్చును కొన్ని గ్రామపంచాయతీలలో నాటి సర్పంచ్‌లు, మరికొన్ని గ్రామపంచాయతీలలో కార్యదర్శులు భరించారు. వేడుకలు ముగిసిన తరువాత చేసిన ఖర్చులో కొంత భాగమే చెల్లించారు. మిగతా పెట్టుబడిని చెల్లిస్తామని చెప్పిన అధికారులు ఆ తరువాత నాటి కలెక్టర్ బదిలీపై వెళ్లడంతో పెండింగ్ బిల్లుల కథ కంచికి చేరినట్లైంది. ఇటు గ్రామపంచాయతీ ఖజానా నుంచి డ్రా చేసుకోలేక.. అటు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాక ఏడాదికాలంగా అప్పుల భారాన్ని మోస్తూ పెండింగ్ బిల్లుల మంజూరు కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నాటి సర్పంచ్‌లకు, కార్యదర్శులకు తప్పడం లేదు.

నేడు భయం.. భయంగా..

దశాబ్ది ఉత్సవాల ప్రారంభ సమయంలో పెట్టిన పెట్టుబడిలో అధిక భాగం నేటికీ చేతికందలేదు. ఇటువంటి పరిస్థితిలో ఉత్సవాల ముగింపు వేడుకలను నిర్వహించాలంటేనే అధికారులు బెంబేలెత్తిపోతున్నారు. వేడుకల నిర్వహణకు ప్రత్యేకంగా నిధుల కేటాయింపు లేకపోవడం.. ప్రస్తుతం సర్పంచ్ హోదాలో ఉన్న ప్రత్యేకాధికారులు వేడుకల నిర్వహణపై అంటీముట్టనట్లుగా వ్యవహరించడం, అదంతా కార్యదర్శులే చూసుకోవాలన్న తరహాలో వ్యవహరించడం కార్యదర్శులకు ఉత్సవాల నిర్వహణ మరోసారి తలనొప్పిగా మారింది. గతం మాదిరిగా ప్రస్తుతం అంత పెద్దమొత్తంలో ఖర్చు లేకున్నా ఆ కాస్తా ఖర్చును కూడా భరించే స్థితిలో లేమని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు.

నిధులు కేటాయిస్తేనే ఉపశమనం...

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించడమో.. పంచాయతీ ఖజానా నుంచి ఖర్చు చేసుకోవాలనో.. ఏదో ఒక ఆదేశం జారీ చేస్తే వేడుకలను వైభవంగా కాకున్నా సంతోషంగా నిర్వహించేందుకు వెసులుబాటు కలుగుతుంది. ఆ దిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కార్యదర్శులు కోరుతున్నారు.

బకాయిలు ఉన్నాయి..



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల ప్రారంభ వేడుకల సందర్భంగా గ్రామ పంచాయతీలు చేసిన ఖర్చులు నేటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రస్తుతం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆదేశాలు ఉన్నాయి. నిధుల కేటాయింపు ప్రస్తావన ఎక్కడా లేదు. ఆర్థికంగా భారమైనా వేడుకలను గ్రామపంచాయతీలలో వైభవంగా నిర్వహిస్తాం.

– చిరంజీవి, ఎంపీఓ, ఇల్లెందు

ధూమపానానికి దూరంగా ఉండాలి







పాల్వంచరూరల్: జగన్నాథపురం పీహెచ్‌సీ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది, మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్లు, జూలూరుపాడు: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పాల్వంచరూరల్: విద్యార్థులు మత్తు కోసమో, స్నేహితుల కోసమో, కుటుంబంలోని వారు తాగుతున్నారని ధూమపానానికి అలవాటుపడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల ప్రధానచార్యులు డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు నరేష్‌బాబు, ప్రవీణ్, ముత్తయ్య, వెంకట్, అశోక్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథపురం పీహెచ్‌సీలో ప్రతిజ్ఞ...

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం జగన్నాథపురంలోని పీహెచ్‌సీలో పొగాకు వినియోగాన్ని నివారించాలని కోరుతూ వైద్యసిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేర్ క్రాంతి, డాక్టర్ కృష్ణప్రసాద్, ఎల్‌హెచ్‌పీ సాయిశృతి, రాజ్యలక్ష్మి, శ్రీనిజ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ

జూలూరుపాడు: ప్రపంచ పొగాకు నియంత్రణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జూలూరుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యులు, వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... పొగాకు కారణంగా అనారోగ్య సమస్యలతోపాటు, నోటి, గొంతు క్యాన్సర్ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పొగాకు సంబంధించిన వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా పిల్లలు పొగాకు అలవాటు కాకుండా రక్షించేందుకు తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దంత వైద్యనిపుణులు డాక్టర్ పోటు వినోద్, డాక్టర్ తేజశ్విని, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ రత్నకుమార్, హెచ్‌వీలు సుభద్రమ్మ, రాధిక, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.